క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శనివారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నార్కట్‌పల్లి డిపో మేనేజర్ ఎం.వెంకటమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సెల్ నంబర్ 9959226309 కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

నల్లగొండ : జాతీయ స్థాయిలో నిర్వహించిన క్యాట్ నాలెడ్జ్ పరీక్షలో నల్లగొండ పట్టణం శివాజీ నగర్‌కు చెందిన శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు సత్తాచాటారని ప్రిన్సిపాల్ బంధ జోసెఫ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తరగతికి చెందిన గగణేశ్వరీ, వి ప్రతీక్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్, ప్రశంసాపత్రంతోపాటు రూ.1000 నగదు గెలుచుకున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, డీన్ శేఖర్‌వర్మ అభినందించారు.

మాణిక్‌రావు థాక్రేను కలిసిన కాంగ్రెస్ నేతలు


పుష్పగుచ్ఛం అందిస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రేను ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత దైద రవీందర్ శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా థాక్రేకు దైద రవీందర్ శాలువాకప్పి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. వారి వెంట కేతేపల్లి ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఆయా మండలాల నేతలు గాజుల సుకన్య, గార్లపాటి రవీందర్‌రెడ్డి, కంపసాటి శ్రీనివాస్, మాద లింగస్వామి, అల్లి అంజన్‌కుమార్, మండడి వెంకట్‌రెడ్డి, పున్నం రమేష్, యూసఫ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుల నియామకం

నల్లగొండ టూటౌన్ : మర్రిగూడ మండల బీజేపీ అధ్యక్షుడిగా రామదాసు శ్రీనివాస్, గట్టుప్పల్ మండల అధ్యక్షుడిగా నామని జగన్నాథంను నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం బీజేపీ సీనియన్ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, దాసోజు యాదగిరాచారి నియామక పత్రాలను శ్రీనివాస్, జగన్నాథంలకు అందజేశారు.

స్థానిక సమస్యలపై సర్వే

చిట్యాల : మండలంలోని నేరడ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, మండల కార్యదర్శి అర్రూరి శ్రీను అధికారులను డిమాండ్ చేశారు. నేరడ గ్రామంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన స్థానిక సమస్యల సర్వేలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని దళిత వాడలో డ్రెయినేజీ నిర్మించాలని కోరారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, ఐతరాజు నర్సింహ, కల్లూరి కుమారస్వామి, కందగట్ల గణేశ్, వడ్డెపల్లి ఎల్లయ్య, కందుల అనిత పాల్గొన్నారు.

బస్‌స్టాప్ తొలగించాలని రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

మునుగోడు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా నూతనంగా ఏర్పాటుచేస్తున్న బస్‌స్టాప్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఐఎస్ఓ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట రాస్తారోకో చేపట్టారు. పాఠశాల ఎదుట బస్‌స్టాప్ ఏర్పాటు చేస్తే అక్కడికి ఆకతాయిలు వచ్చి విద్యార్థులకు ఇబ్బంది కలిగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు పందుల రవితేజ, నియోజకవర్గ అధ్యక్షుడు పుల్కరం శివ, అధ్యక్షుడు రాసోలు నరేష్, కార్యదర్శి శ్రీరామ్, హరీశ్, వంశీ, నవీన్, గిరి, శివ, ఠాగూర్, కిరణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చండూరు : చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2022–23 విద్యా సంవత్సరానికి కంప్యూటర్ (అతిథి అధ్యాపకుడు) ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు పీజీ సబ్జెక్ట్‌లో 55 మార్కులు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు జనవరి 25వ తేదీ వరకు కళాశాలలో దరఖాస్తులు అందించాలన్నారు.

మౌలిక వసతులు కరువు!

- అద్దె భవనంలో పంచాయతీ కార్యాలయం
- రేషన్ సరుకులకు 3కి.మీ నడుస్తున్న లబ్ధిదారులు
- ఇబ్బందులు పడుతున్న రాజాపేట తండావాసులు


అద్దె భవనంలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి

మర్రిగూడ : మండల పరిధిలోని కమ్మగూడ, కొట్టాల, వెంకేపల్లి, రాజాపేటతండాలను రాష్ట్ర ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఆయా గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలను మాత్రం కల్పించలేదు. కొత్త గ్రామపంచాతీ అయిన రాజాపేటతండాలో 140 కుటుంబాలు 687 మంది ఓటర్లు, వెయ్యికిపైగా జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని పలుమార్లు ఉన్నతాధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ సరుకులకు పక్క గ్రామానికి..

పాత గ్రామపంచాయతీ వట్టిపల్లి నుంచి రాజాపేట తండా వరకు 2 నుంచి 3కి.మీ దూరం ఉంటుంది. ప్రతినెలా వట్టిపల్లి నుంచి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రాజాపేటతండా వాసులు వాపోతున్నారు. కరోనా సమయంలో స్థానిక గ్రామపంచాయతీ భవనంలోనే రేషన్ సరుకులు అందించారు. ఇప్పుడు కూడా అందులోనే అందిస్తే బాగుంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నూతన గ్రామపంచాయతీ ఏర్పడింది కానీ రేషన్ దుకాణం ఏర్పాటు విషయంపై అలసత్వం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. వాహనాలు లేని వారు, వృద్ధులు రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు.

అద్దె భవనంలో గ్రామపంచాయతీ..

రాజాపేటతండా గ్రామపంచాయతీకి సొంత భవనం నిర్మించలేదు. అద్దె భవనంలో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయానికి గతంలో ప్రతినెలా రూ.2వేలు అద్దె చెల్లించేవారు. మూడు నెలలనుంచి మరో రూ.500 పెంచడంతో ప్రస్తుతం రూ.2500 అద్దె చెల్లిస్తున్నారు. గ్రామానికి సంబంధించి శ్మశానవాటిక నిర్మాణం కూడా అసంపూర్తిగానే ఉంది. గ్రామానికి దగ్గరగా ఉండడంతో పనులను నిలిపివేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రజా శ్రేయస్సు దృష్ట్యా రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, ప్రజాభిప్రాయం మేరకు శ్మశానవాటికను పూర్తి చేయాలని, సొంత గ్రామపంచాయతీ భవనం ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



రాజాపేటతండాలో సొంత రేషన్ దుకాణం ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కరోనా సమయంలో అందించిన మాదిరిగానే ఎల్లవేళలా మా గ్రామపంచాయతీలోనే లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందించాలి. ప్రస్తుతం వట్టిపల్లి గ్రామం నుంచే రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తుంది.

– రమావత్ లక్ష్మణ్‌నాయక్, 6వ వార్డు మెంబర్

పట్టించుకోవడం లేదు



రాజాపేటతండా గ్రామపంచాయతీగా ఏర్పడి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా రేషన్ దుకాణం ఏర్పాటు చేయలేదు. ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. వృద్ధులు రేషన్ సరుకుల కోసం వట్టిపల్లికి వెళ్లి రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

–మాదగోని రాజు, రాజాపేటతండా గ్రామస్తుడు

నివేదికలు సిద్ధం చేశాం

మండల జనరల్‌బాడీ సమావేశంలో రాజాపేటతండాలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. జిల్లా అధికారులు అర్హత ఉన్న గ్రామపంచాయతీల వివరాలను తెలియజేయాలన్నారు. అందుకు సంబంధించిన సమాచారం జిల్లా అధికారులకు పంపేందుకు నివేదికలను సిద్ధం చేశాం.

– పి.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక


నార్కట్‌పల్లి : కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి : పార్టీలో చేరిన ప్రతిఒక్కరూ బీఆర్ఎస్ అభివృద్ధికి కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్‌పల్లి మండలం బాజకుంట గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. పార్టీలో చేరినవారిలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండూరు రాజు, సతీష్, ప్రశాంత్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, మధు, శ్రీకాంత్‌రెడ్డి, రవి, ఉపేందర్, యాదిరెడ్డిలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఈదునూరి రవీందర్‌రెడ్డి, మేక వెంకట్‌రెడ్డి, వాజీద్, తిరుగుడు మహాలింగం, నర్సింహాచారి, పరమేష్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్ భవనానికి నిధులు మంజూరు

నకిరేకల్ : మున్సిపాలిటీ కేంద్రంలో ముదిరాజ్ కులస్తుల కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.25లక్షలు మంజూరు చేస్తున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రకటించారు. నకిరేకల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ముదిరాజ్ కులస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. నకిరేకల్‌లోని చెరువుల్లో సభ్యత్వాలు లేనివారికి సభ్యత్వం కల్పిస్తామన్నారు. పెద్దమ్మ తల్లి గుడి ప్రహరీ నిర్మాణానికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ముదిరాజ్ కులస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, ముదిరాజ్ సంఘం నాయకులు మల్లెబోయిన దశరథ, బొడ్డు కాటమయ్య, బండమీది గోపాల్, బండమీది శంకర్, బొడ్డు వెంకన్న, రాము తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ సైదిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : సీనియర్ సిటిజన్స్‌కు తనవంతు సహకారం అందిస్తానని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ జిల్లా అధ్యక్షుడు సముద్రాల మల్లికార్జున్ రూపొందించిన 2023 సంవత్సరం క్యాలెండర్‌ను సైదిరెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సముద్రాల మల్లికార్జున్, సుదర్శన్‌రెడ్డి, బొబ్బిలి శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్య, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు


వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ

చండూరు : బాలలను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా గాంధీజీ విద్యాసంస్థలు కృషి చేస్తున్నాయని చండూరు మున్సిపాలిటీ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న అన్నారు. స్థానిక గాంధీజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను మండల విద్యాధికారి గురువారావు, సీఐ.అశోక్‌రెడ్డి, ఎస్ఐ.నవీన్‌కుమార్‌తో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు వేదికగా నిలుస్తాయని అన్నారు. రెండు రోజులపాటు నిర్వహించే ఈ ప్రదర్శనలో 204 దేశాల కరెన్సీ నోట్లు, నాణెములు, స్టాంపుల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థుల రూపొందించిన సుమారు 300 వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్‌యాదవ్, ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపాల్ చెరుపల్లి రామయ్య, సత్యనారాయణమూర్తి, వెంకట్రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రం పరిశీలన


శిబిరాన్ని పరిశీలిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి

మునుగోడు : కంటి వెలుగు వైద్య శిబిరంలో ప్రతిరోజు 150 మందికి పరీక్షలు జరిపి అవసరమైనవారికి మందులు, అద్దాలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్. వేణుగోపాల్‌రెడ్డి వైద్యులకు సూచించారు. శుక్రవారం ఆయన మునుగోడులోని కంటి వెలుగు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన ప్రతిఒక్కరికీ కంటి పరీక్షలు చేయాలని, అందుకోసం స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. ఆయన వెంట డాక్టర్ జమీర్, శివప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు ధనమ్మ, సుష్మిత తదితరులు ఉన్నారు.

‘కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం’

చండూరు : రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కాసాల నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం చండూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో పంగ సురేష్‌యాదవ్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కురుపాటి గణేశ్, వడ్డేపల్లి భాస్కర్, శంకర్ తదితరులు ఉన్నారు.

పానగల్లులో నిత్య జాతీయ గీతాలాపన

రామగిరి(నల్లగొండ) : యువతలో దేశభక్తిని పెంపొందించడమే జనగణమన ఉత్సవ సమితి ప్రధాన లక్ష్యమని ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్ అన్నారు. పానగల్లులో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆలకుంట్ల మోహన్‌బాబు రాజేశ్వరి, కొలనుపాక రవికుమార్, దోసపాటి శ్రీనివాస్, పోలా జనార్దన్, విడబోయిన లక్ష్మీకిరణ్, కందాల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే క్రీడలు ప్రారంభం


క్రీడలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి(నల్లగొండ) : గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మునావర్ అమీనా అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఓటమిని కూడా స్ఫూర్తిగా తీసుకుని గెలుపు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శిల్పా, నుస్రత్, విజయలక్ష్మి, లీలాదేవి, స్వామి, దేవామని, అనిత, రాణి, గోవర్దన్, కిరణ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అయేషా, మజారుద్దీన్, రామలింగయ్య, పెంటయ్య, లింగస్వామి, రేణుక, సాహితి తదితరులున్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నల్లగొండ టూటౌన్ : కాలనీల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ ఈఈ రాములు అన్నారు. హరిత శుక్రవారంలో భాగంగా పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో స్థానిక కౌన్సిలర్ గుర్రం ధనలక్ష్మితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లోని యువత, విద్యార్థులు మొక్కలు నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈలు అశోక్‌కుమార్, వెంకన్న, ఏఈ రవీందర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

22న సంఘీభావ సభ

నల్లగొండ టౌన్ : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈ నెల 22న జరిగే క్యూబా సంఘీభావ సభకు మేధావులు, విద్యార్థులు, యువజనులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లూరి కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దశాబ్దాల కాలంగా ఏమాత్రం వెరవకుండా పోరాట స్ఫూర్తిని క్యూబా కొనసాగిస్తోందన్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ


రాగిజావ అందజేస్తున్న ఎంఈఓ నాగయ్య

కట్టంగూర్ : మండలకేంద్రంలోని అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు.. తల్లిదండ్రులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన రాగిజావను శుక్రవారం ఎంఈఓ మేక నాగయ్య పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఇందిరాదేవి, ఉపాధ్యాయులు రవి, స్వరూప, ఎస్ఎంసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు మేడి శంకర్, మైనం సైదులు, వెంకన్న, పేరపాక రవి, ఎం నాగేష్ తదితరులు ఉన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత

చిట్యాల : మున్సిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం (ఒకటో వార్డు)కు చెందిన పేద విద్యార్థి బొబ్బలి సందీప్‌రెడ్డి ఉన్నత చదువుల నిమిత్తం అమెరికాకు వెళ్తున్నాడు. ఈ మేరకు ఏస్ అకాడమి చైర్మన్ ప్రొ.వైవీ.గోపాలకృష్ణమూర్తి ఆర్థిక సహకారంలో ఏర్పాటు చేసిన ల్యాప్‌టాప్‌ను హైదరాబాద్ గ్రేటర్ బీఎస్పీ అధ్యక్షుడు రుద్రవరం సునీల్ శుక్రవారం సందీప్‌రెడ్డికి అందజేశారు.


సందీప్‌రెడ్డికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న సునీల్

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి


నల్లగొండలో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేవైఎం నాయకులు


మర్రిగూడ : దిష్టిబొమ్మను దహనంచేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకొని దిష్టిబొమ్మను లాగేశారు. దాంతో బీజేవైఎం నాయకులు కాగితాలు, క్లాత్‌లను ఒక దగ్గర వేసి దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు. పలువురు బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అంతకు ముందు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఐతరాజు సిద్ధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీరుతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఫీజు బకాయిలు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు సర్టిఫికెట్లను అడిగితే కాలేజీ యాజమాన్యాలు ముక్కుపిండి ఫీజులు వసూలు చేస్తున్నారని, అయినా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేవడంలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, దాసోజు యాదగిరాచారి, గడ్డం మహేష్, బాకి నర్సింహ, పిన్నింటి నరేందర్‌రెడ్డి, దుబ్బాక సాయి కిరణ్, దుర్గ, శ్రీకాంత్, ప్రసాద్, సూర్య, అనిల్ పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

మర్రిగూడ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకుడు మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిలను చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. బీజేపీ నాయకులు నర్రా పరమేష్, బోయపల్లి రాజుగౌడ్, రాజేందర్‌నాయక్, పల్లె వెంకటేష్, మామిడి పరుశురామ్, యాదగిరిగౌడ్, అజ్జలాపురం సుమన్, బాలాజీనాయక్, అయిలి పెద్దయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మునుగోడు : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ బీజేవైఎం మండల అధ్యక్షుడు జీడిమడ్ల జానీ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు క్రాంతికుమార్, నరేందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు


కిష్టాపురంలో రేషన్ దుకాణం తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

మునుగోడు : ప్రభుత్వ నిబంధనలు పాటించని రేషన్ డీలర్లపై చట్టపరమైన చర్యలు తప్పవని చండూరు డీటీసీఎస్ బి.విజయ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని కొరటికల్, పులిపలుపుల, కిష్టాపురం గ్రామాల్లోని రేషన్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. కిష్టాపురం రేషన్ దుకాణంలో 28 క్వింటాళ్ల బియ్యం తేడా రావడంతో ఆ డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రేషన్ డీలర్ తమ దుకాణంలో విధిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, లేకుంటే నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటామన్నారు. నిర్ణీత సమయానికి దుకాణాలు తెరిచి అర్హులైన ప్రతిఒక్కరికీ సరుకులు అందించాలని సూచించారు. ఆమె వెంట ఆర్ఐ అబీద్, డీలర్లు ఉన్నారు.

ఈ కేవైసీ చేసుకోవాలి

కట్టంగూర్ : మేజర్ గ్రామ పంచాయతీ కట్టంగూర్ పరిధిలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులు ఈ కేవైసీ చేసుకోవాలని ఆరోగ్య మిత్ర బూర్గు సైదులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. శుక్రవారం కట్టంగూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జాబితాలో ఉన్న లబ్ధిదారుల రేషన్‌కార్డు నంబర్, ఫోన్ నంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఈ కేవైసీ చేశారు.

సామూహిక సీమంతాలు


సామూహిక సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ యశోద

మర్రిగూడ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. గర్భిణులు ఏఎన్ఎం వద్ద పేరు నమోదు చేయించుకోవాలని, కాల్షియం, ఐరన్ మాత్రలు తప్పకవేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ విజయప్రసాద్, పంచాయతీ కార్యదర్శి యూసుఫ్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీ, విమలాదేవి, రమాదేవి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న క్లబ్ సభ్యులు

చిట్యాల : వాసవి, వనిత క్లబ్‌ల సభ్యులు సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పందిరి గీతారమేష్ కోరారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన చిట్యాల గ్రేటర్ వాసవి లేజెండ్, వనితా క్లబ్ నూతన కార్యవర్గాల ఎన్నిక కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వాసవి లెజెండ్ క్లబ్ అధ్యక్షుడిగా ప్రొద్దుటూరి శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శిగా మేడిశెట్టి ఉమాశంకర్, కోశాధికారిగా ఇమ్మడి వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలిగా వనమా హైమా అరుంధతి, ప్రధానకార్యదర్శిగా వనమా మౌనిక, కోశాధికారిగా పోలా సరితలతోపాటు మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు తేరటుపల్లి హన్మంతు, పట్టణ అధ్యక్షుడు వాసా విద్యాసాగర్ పాల్గొన్నారు.

విద్యార్థినుల ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు

శాలిగౌరారం : మండలంలోని మాధారంకలాన్ గ్రామంలో శుక్రవారం బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జేరిపోతుల మంజులచంద్రమౌళి పాల్గొని విద్య, పౌష్టికాహారం, అవగాహన కల్పించారు. మహిళలు పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యాలు దరిచేరవని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశోక్‌రెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహబూబారెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు మామిడి పూలమ్మ ధనలక్ష్మి, రజిత, ఆయాలు పాల్గొన్నారు.

విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు



నల్లగొండలోని బస్టాండ్ వద్ద ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహ పునః ప్రతిష్టాపన పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ నెల 23న నేతాజీ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న పిల్లి రామరాజు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలో పలు ప్రాంతాల్లో అనారోగ్యంతో మృతిచెందిన మూడు కుటుంబాలకు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, ఆర్కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజుయాదవ్ ఆర్థికసాయం అందజేశారు. 15వ వార్డు చర్లపల్లికి చెందిన ఆలె శ్రీనివాస్ కుటుంబానికి రూ.10 వేలు, 24వ వార్డు మాన్యంచల్కకు చెందిన తవుజోజు సురేష్ కుటుంబానికి రూ. 10 వేలు, 46వ వార్డు బొట్టుగూడకు చెందిన మామిడి దీపక్ కుటుంబానికి రూ.10 వేల చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ పేద ప్రజలను తమ ఫౌండేషన్ ద్వారా ఎల్లవేళలా ఆదుకుంటామని తెలిపారు.